

ఆలయం నాడు..

ఆపదమొక్కుల.. వాడపల్లి!

ఏడు వారాల వెంకన్నగా ఖ్యాతి



ఆలయం నేడు..



ఉన్నావా అసలున్నావా.. ఉంటే కళ్లుమూసుకున్నావా.. భక్తతుకారాం సినిమాలో పాట ఇది.. నిన్న మొన్నటి వరకూ చాలామంది అభిప్రాయం కూడా ఇదే.. దేవుడు లేడనేది వాదన.. ఈ అభిప్రాయం తప్పని.. నేనున్నానని నిరూపించాడు.. వాడపల్లి వేంకటేశ్వరుడు. అందుకే ఆయనను నిదర్శనమూర్తిగా కొలుస్తారు. నిజానికి 2009 వరకు ఆ స్వామిని కొలిచేవారే అరుదు.. కల్యాణోత్సవాల సమయంలో తప్ప ఆ స్వామి చెంత సందడే ఉండేది కాదు.. మరి నేడు.. ప్రతి వారం లక్షలాదిగా భక్తులను తన చెంతకు రప్పించుకుని కోరిన కోర్కెలు తీర్చే ఆపదమొక్కుల వాడిగా వినుతికెక్కారు.. అమెరికా.. ఆస్ట్రేలియా.. తదితర దేశాల నుంచి భక్తులు వస్తున్నారంటే ఆ స్వామి దయ కాకపోతే మరేమిటి.. కోరిన కోర్కెలు తీరుస్తాడనే నమ్మకమే వాడపల్లికీ మహర్దశ. - ఆత్రేయపురం

దేవుడున్నాడు.. భక్తజనం కోర్కెలు తీరుస్తున్నాడు.. అందుకే ఒక్కటా రెండా ఏకంగా ప్రతి శనివారం 40 వేల నుంచి 50 వేల మంది భక్తులు ఆ స్వామిని చూసేందుకు ఎక్క డెక్కడి నుంచో వస్తున్నారు. స్వామిని దర్శించుకుని వెళుతున్నారు. ఒకనాడు ఎక్కడ ఉందో తెలియని వాడపల్లి.. వేంకటేశ్వరుడి ఊరుగా తిరుమల అంత ప్రసిద్ధి కెక్కింది. గౌతమి నదీ తీరాన పచ్చని పంటపొలాల నడుమ వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తజన గోవిందనామస్మరణతో విరాజిల్లుతుంది. సుమారు 15 ఏళ్ల కిందట ఏడాదికోమారు స్వామి ఉత్సవాలు చేయాలంటేనే కష్టం.. అటువంటి స్థితి నుంచి నేడు తిరుమల తరహాలో ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. అలనాడు వందల్లో భక్తులుంటే నేడు ఆ సంఖ్య వేలకు చేరింది. ఓ భక్తుడు సొంత విమానంలో వచ్చి స్వామిని దర్శించుకుని రూ.కోటి విరాళం అందించి వెళ్లారంటే స్వామి ఎంత మహిమాన్వితుడో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత స్వామి వార్షికాదాయం రూ.32 కోట్లకు చేరుకుంది.

ఎర్రచందనం కొయ్యతో స్వామి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో స్వయం భూ ఎర్రచందన కొయ్య విగ్రహంతో మూర్తీభవించిన స్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిస్తారు. దేవతామూర్తుల విగ్రహాలను శిలతో తయారు చేస్తే స్వామి మాత్రమే ఎర్రచందనంతో మూర్తీభవించారు.

2009 నుంచి 7 ప్రదక్షిణలు..

2009 మార్చి 23న అప్పటి ఈవో, సిబ్బంది ఏడు వారాల వెంకన్న దర్శనం...ఏడేడు జన్మల పుణ్యఫలంగా స్వామి ఖ్యాతిని ఇనుమడింప జేశారు.. అక్కడి నుంచి స్వామి వెనుతిరిగి చూసుకోలేదు. భక్తుల కోర్కెలు తీర్చే స్వామిగా అంచలంచెలుగా వినుతికెక్కారు. ఏడు శనివారాలు.. స్వామివారి ఆలయంలో ఏడు ప్రదక్షణలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీరుస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా నిలిచింది. తిరుమల తరహాలో పవిత్రోత్సవాలు, అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవాలు, గోదాదేవి కల్యాణం కోట్లాది రూపాయలతో నిర్వహిస్తున్నారు. నిత్యం ఆలయంలో ఐశ్వర్యలక్ష్మీ హోమం, నిత్యకల్యాణం, అష్టోత్తర పూజలు చేస్తారు.

నాడు వడ్డికాసులవాడే..

2009కి ముందు స్వామి వార్షికాదాయం రూ.18 లక్షలు ఉండేది. ప్రతి ఏటా మార్చి నెలలో స్వామి కల్యాణం నిర్వహిస్తారు. ఆదాయం అంతంత మాత్రంగానే ఉండడంతో అప్పటి ఈవో, సిబ్బంది రూ.3 లక్షల వరకూ అప్పు తెచ్చేవారట. అనంతరం శిస్తును వసూళ్లు చేసి స్వామి కల్యాణం అప్పులు తీర్చేవారు. ప్రస్తుతం 6-ఏ నుంచి డిప్యూటీ కమిషనరు స్థాయికి ఈ క్షేత్రం చేరుకుంది. వార్షికాదాయం రూ.18 లక్షల నుంచి నేడు రూ.32 కోట్లకు చేరుకుంది. 2023లో డీసీ హోదా దక్కించుకున్న ఈ క్షేత్రం 2026లో రీజనల్ జాయింట్ కమిషనరు హోదాకు చేరుకోనుంది. ఆలయంలో 310 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏటా జీతభత్యాల కింద రూ.6.32 కోట్లు చెల్లిస్తున్నారు.

భూములు.. 116 ఎకరాలు



తిరుమల తరహాలో స్వామికి దాతలు బంగారు విరాళాలు అందజేస్తున్నారు. ప్రస్తుతం స్వామివారికి 7.421 కిలోల బంగారం ఉంది. వెండి 183.339 కిలోలు ఉంది. స్వామికి 406 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 116 ఎకరాలు మాత్రమే ఆధీనంలో ఉంది. దీని ద్వారా రూ.35 లక్షల ఆదాయం వస్తుంది. మిగిలిన భూమి అన్యాక్రాంతమైనట్టు తెలిసింది.

నిత్యాన్నదానం

నిత్యాన్న దానం ఉంది. ప్రతి నెలా 1.50 లక్షల మంది భక్తులు స్వామి ప్రసాదం స్వీకరిస్తారు.రూ.40 లక్షలు ఖర్చవుతుంది. అన్నప్రసాదానికి రూ.11.09 కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. రూ.120 కోట్లతో కేంద్రం అందించే ప్రసాద స్కీమ్‌కు ప్రతిపాదనలు చేసి నట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఆదాయం రూ.39 కోట్లు

ఏడాది	ఆదాయం	ఖర్చులు (కోట్లు)
2021-22	రూ.9.36	రూ. 8.68
2022-23	రూ.18.82	రూ.18.14
2023-24	రూ.28.88	రూ. 26.53
2024-25	రూ.39.09	రూ. 32.01

ఫిక్సిడ్ డిపాజిట్లు రూ.3.65 కోట్లు

సేవింగ్స్ ఖాతాలో సుమారు రూ.5 కోట్లు

స్వామి వెలిశారిలా..

విష్ణుమూర్తి ఒకప్పుడు నౌకాపురిగా పిలిచే వాడపల్లిలో వెలుస్తానంటూ అభయమిచ్చాడట.. కొంత కాలానికి గోదావరిలో ఒక పెట్టె కొట్టుకువచ్చింది.. ఒక వృద్ధుడికి స్వామి కలలో కనిపించి ఆ చందన పెట్టె గురించి తెలియజేశాడట.. మరునాడు పెట్టె తీసి తెరిస్తే ఎర్రచందనంతో చెక్కిన స్వామి దివ్య మంగళమూర్తి కనిపించిందట. ఇది తెలిసి నారదుడు స్వామికి వేంకటేశ్వరుడు అని నామకరణం చేసి ఆలయాన్ని నిర్మించాడని పురాణ కథనం.



చిందర వందరగా పడేసిన వస్తువులు

మాజీ మంత్రి జవహర్ ఇంట్లో చోరీ

కొవ్వూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ నివాసంలో దొంగలు పడ్డారు. కొవ్వూరు పట్టణం నందమూరు రోడ్‌లో ఉన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి కె.ఎస్.జవహర్ ప్రధాని నరేంద్ర మోదీ సభకు ఇన్‌చార్జిగా నియమించడంతో గత 10 రోజుల కిందట గుడివాడ వెళ్లారు. మూడు రోజుల కిందట ఆయన భార్య, పిల్లలు స్వగ్రామం తిరువూరు వెళ్లారు. శనివారం ఇంట్లో మొక్కలకు నీళ్లు పోయడానికి జవహర్ అనుచరుడు వి.వి.రాజు ఇంటికి వచ్చాడు. ఇంటి వెనుక వైపు తలుపులు తెరచి ఉండడంతో అనుమానం వచ్చి చూశాడు. దొంగతనం జరిగిందని గమనించి పోలీసులు, జవహర్‌కు సమాచారం అందజేశాడు.డీఎస్పీ జి.దేవకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీరువాల్లో బట్టలు, సామగ్రి చిందరవందరగా పడవేసినట్టు గుర్తించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న జవహర్ భార్య ఉష, కుమారుడు కొత్తపల్లి ఆశిష్‌లాల్ హుటాహుటిన కొవ్వూరు వచ్చారు. ప్రాథమికంగా 2 సెల్ ఫోన్లు, 2 వాచీలు, 3 బంగారపు ఉంగరాలు, ఒక టీవీ, రూ.45 వేలు నగదు, వెండి వస్తువులు చోరీ చేసినట్టు సమాచారం.రాజమహేంద్రవరం నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వేలిముద్రలు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.



రోడ్డుపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

పుష్కర అంచనా రూ.2 వేల కోట్లు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం : ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి 2027 పుష్కరాలకు రూ.2 వేల కోట్లు అంచనాలు ప్రభుత్వానికి పంపించామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వనగర్‌లో రూ.90 లక్షలతో చేపడుతున్న రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. గోదావరి పుష్కరాలకు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలో ఇంటర్నల్ రోడ్డుకు సంబంధించి గత వైసీపీ హయాంలో వెంకటేశ్వరనగర్ రోడ్డుకు నిధులు మంజూరైనా.. ఈ ప్రాంతంలో వైసీపీ ఓటర్లు లేరనే తప్పుడు భావనతో కక్షపూరితంగా ఏళ్ళతరబడి రోడ్డు వేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు పరుగులు పెట్టిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ నెల 7న గోదావరి రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభి స్తున్నామని చెప్పారు. అప్పర్ ప్రామినేట్ పనులు ముందుగా చేపడుతున్నామని.. లోయర్ ప్రామినేట్ పనులకు ఇరిగేషన్ అధికారుల అనుమతి రావాల్సి ఉందన్నారు. గత పదినెలల్లో రాజమహేంద్రవరంలో రూ.100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశామన్నారు. నగరంలో 21 పార్కుల సుందరీకరణకు రూ.10 కోట్లు కేటాయించామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, నగర తెలుగు మహిళ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ తదితరులు పాల్గొన్నారు.

మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్

కార్పొరేట్ కార్యాలయం: నం.302బి, 3వ సద్గురు ఇమేజ్, క్యాపిటల్ పార్క్, ఇమేజ్ గార్డెన్స్ రోడ్, VIP హిల్స్, మాదాపూర్, హైదరాబాద్, తెలంగాణ - 500081

టెలిఫోన్: 040-49951666, ఇ-మెయిల్: co@maximusarc.com

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 6(2) మరియు రూల్ 8(6) నిబంధనతో చదవబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ రూల్స్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

పై నిబంధనలకు అనుగుణంగా, సెక్యూర్డ్ క్రెడిటార్ (మెసర్స్ మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్) కు తాకట్టు పెట్టబడిన/ చార్జ్ చేయబడినట్టి, మెసర్స్ మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్ అధీకృత అధికారి ద్వారా భౌతిక స్వాధీనం చేసుకోబడినట్టి దిగువ వివరించిన స్థిరాస్తిని మెసర్స్ సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఋణగ్రహీత), శ్రీ ఉప్పులూరి వెంకట సత్యనారాయణ మరియు శ్రీమతి ఉప్పులూరి వీర వెంకట కాశీ నాగకుమారి (వ్యక్తిగత హామీదారులు) నుండి మెసర్స్ మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్‌కు (అసైన్‌మెంట్ అగ్రిమెంట్ తేదీ 01.09.2023 ప్రకారం పృథ్వీ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ & సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్ ద్వారా మెసర్స్ మ్యాక్సిమస్ ఎఆర్‌సి కంపెనీ లిమిటెడ్‌కు కేటాయించబడిన బకాయి) చెల్లింపు తేదీ వరకు తదుపరి వడ్డీ, చార్జీలు మరియు వ్యయాలతో 31.03.2025 నాటికి బకాయి మొత్తం రూ.12,68,98,744/- (రూపాయలు పన్నెండు కోట్ల అరవై ఎనిమిది లక్షల తొంభై ఎనిమిది వేల ఏడు వందల నలభై నాలుగు) రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అదే" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన 22.05.2025న విక్రయించబడునని ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా ప్రకటన ఇవ్వడమైనది.

రిజర్వుధర రూ.150 లక్షలు మరియు బయానా 15 లక్షలు.

స్థిరాస్తి సంక్షిప్త వివరణ

క్ర.సం	ఆస్తి వివరణ
1	1. మెసర్స్ సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లా, రాజానగరం మండలం, చక్రద్వారాబంధం గ్రామపంచాయితీ, వెలుగుబంద గ్రామ ఆర్.ఎస్.నం.663 వద్ద సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ఆవరణలో భూమిపై బిగించిన అన్ని ప్లాంట్ & మెషినరీ.
	రిజర్వు ధర రూ.150 లక్షలు; బయానా: రూ.15 లక్షలు
	తాకట్టు ఋణ భారాలు: లేవు

ఆస్తి(లు) తనిఖీ తేదీ & సమయం: 09.05.2025న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం. మధ్యన.

వేలం విధానం: ఆన్‌లైన్ ఇ-వేలం https://sarfaesi.auctiontiger.net ద్వారా.

బిడ్ దాఖలుకు మరియు బయానా చెల్లింపుకు చివరి తేదీ మరియు సమయం: 21.05.2025న సా.5.00 గం. లేదా ఆలోగా

ఇ-వేలం తేదీ: 22.05.2025న ఉ.10.00 గం. నుండి ఉ.11.00 గం.మధ్యన.

బిడ్ పెరుగుదల: రూ.5,00,000/-

వేలం సవివర నియమ నిబంధనల కొరకు మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) వెబ్‌సైట్ అనగా: www.maximusarc.com/tenders లో అందించిన లింకును చూడగలరు. కాగోరు బిడ్డర్లు ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్‌రప్టసీ కోడ్ 2016 యొక్క సెక్షన్ 29ఎ క్రింద అనర్హులు కారని నిర్ధారిస్తూ "నోటరీ చేసిన అఫిడవిట్"ను దాఖలు చేయగలరు.

తేది: 29.04.2025 | సం/- (ఆర్.వి.రాజు) అధీకృత అధికారి

ప్రదేశం: హైదరాబాద్ | మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్, సెల్: 9848170245

ఇదేమి కాలం!



అబ్బబ్బా ఇది ఏమి వాన : కాకినాడ నగరంలో శనివారం కురుస్తున్న వాన

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఒక పక్క తీవ్రమైన ఎండ.. ఉదయం ఏడు నుంచే నడినెత్తిన సూర్యుడి ప్రతాపం.. బయటకు రావాలంటేనే ఎండవేడికి ఉక్కపోత..చెమటలతో తడిచి ముద్దవుతున్న పరిస్థితి.. మరో పక్క అంత ఎండతో ఆపసోపాలు భరిస్తోన్న ప్రజలకు సాయంత్రం అయ్యేసరికి ఒక్క సారిగా వరుడి కరుణతో ఉపశమనం.. చిరుజల్లుల నుంచి కుండపోత వానతో చల్లబడుతోన్న వాతావర ణం.. ఒకపక్క ఈదురుగాలులు.. మరోపక్క కూలుతోన్న విద్యుత్ స్తం భాలు.. నేలకొరుగుతున్న చెట్లతో విచిత్ర పరిస్థితులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నెలకొన్నాయి. మండు వేసవితో



ఎండకు తాళలేక..

లోటు నుంచి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత నెల ఏప్రిల్‌లో కురిసిన వర్షాలు జిల్లాను లోటు నుంచి సాధారణ వర్షపాతం స్థాయికి తీసుకొచ్చాయి. వాస్తవా నికి అంతకుముందు మార్చి నెలలో ఉమ్మడి జిల్లా లోటు వర్షపాతం జాబితాలో ఉంది. కాకినాడ జిల్లాలో మార్చి నెలలో సాధారణ వర్షపాతం 12.49 సెంటి మీటర్లు కురవాల్సి ఉంటే 0.82 సెం.మీతో లోటులో ఉంది. కోనసీమ జిల్లాలో 12.02 సెం.మీ.కు సున్నా వర్షపాతం నమోదైంది. తూర్పుగోదావరి జిల్లాలో 15.18 సెం.మీకు 0.04 మి.మీ కురిసింది. ఏప్రిల్ నెలలో కాకి నాడ జిల్లాలో 16.4 సెం.మీ. వర్షం కురవాల్సి ఉంటే ఏకంగా 45.81 సెం.మీ వర్షపాతం నమోదైంది. కోన సీమ జిల్లాలో 10.52 సెం.మీ.కు 20.17 సెం.మీ. కురి సింది. తూర్పుగోదావరి జిల్లాలో 16.73 సెం.మీ.కు 47.49 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఒకరకంగా ఈనెలలో ఈ స్థాయిలో వర్షపాతం నమోదవడం అరుదని వాతావరణ శాఖాధికారులు వివరించారు.

ఉదయం కుమ్ముడు.. సాయంత్రం దంచుడు

- వాతావరణంలో పెనుమార్పులు
- ఉదయం ఎండ.. సాయంత్రం వాన
- 4 రోజులుగా విస్తారంగా వర్షాలు
- శనివారం కాకినాడలో అత్యధికం
- సాధారణ స్థితికి వర్షపాతం
- ఆశ్చర్యపోతున్న అధికారులు

అల్లాడించే ఏప్రిల్, మే నెలల్లో గడచిన కొన్నిరోజులుగా భారీ వర్షాలు జిల్లాను ఊపేస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఉదయం తీవ్రమైన వేడి.. సాయంత్రం అయ్యేసరికి భారీ వర్షాలతో విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలో శనివారం అనేక చోట్ల 38డి గ్రీలకుపైగా ఎండ చుక్కలు చూపిం చగా..మధ్యాహ్నం దాటేసరికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉన్నట్టుండి కుండ పోతగా వాన.. ఈదురుగాలులు..బీభత్సం సృష్టించాయి. కాకినాడ రూరల్‌లో అయితే ఏకంగా రాష్ట్రంలోనే అత్యధికంగా 4.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాకినాడ నగరంలో రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లోకి వాన నీరు వచ్చేసింది. అటు కోటనందూరులో 2.7, కిర్లంపూడి 2.1, తుని 2.25, తాళ్లరేవు,శంఖవరం,రౌతులపూడి,గొల్లప్రోలు, పిఠాపురం, పెదపూడి మండలాల్లో 1.7, తూర్పుగోదావరి జిల్లా రంగంపేట 2.75, గోపాలపురంలో 0.25 మి.మీ. వర్షపాతం నమోదైంది.అయితే ప్రధానంగా తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలతో పోల్చితే కాకినాడ జిల్లాలో గడచిన రెండువారాలుగా వర్షాలు అనేక మండలాల్లో దంచికొడుతున్నాయి. ఏకంగా భారీ ఈదురు గాలులు, కుండపోత వర్షం కురుస్తుండడం విశేషం. ఇటీవల అన్నవరంలో కురిసిన భారీ వర్షానికి ఆలయ మెట్లపై ధారలా వాననీరు ప్రవహించింది. శనివారం సైతం జిల్లాలో అనేక మండలాల్లో వానకుతోడు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ముఖ్యంగా కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో అయితే ఏకంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కొన్నిరోజులుగా గాలివానకు పడుతూనే ఉన్నాయి.



పిఠాపురంలో వానకు తడవకుండా ధాన్యంపై కప్పిన బరకాలు



బోల్తాపడిన ట్రాక్టర్..మృతిచెందిన యజమాని

అలవాటైనా.. ఆయువు తీసింది..

పెరవలి,మే 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి ఊపిరితీసింది.. చిన్నపాటి నిర్లక్ష్యం ప్రాణాలనే బలితీసుకుంది..రొయ్యల చెరువులో ట్రాక్టర్‌తో దున్ని మట్టిని చదును చేసి గట్టున పోస్తుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ వెనక్కువచ్చి తిరగబడి యజమాని మృతిచెందినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పెరవలి మండలం కానూరుకు చెందిన జన్ని రాంబాబు (50) శనివారం ఉదయం తన సొంత రెయ్యల చెరువులో మట్టి దుక్కు దున్నడానికి వెళ్లాడు. చెరువులో మట్టిని ట్రాక్టర్‌తో పైకి గెంటే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. రాంబాబు ట్రాక్టర్ కింద ఇరుక్కుపోవడంతో చుట్టుపక్కల వారు అతన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య లక్ష్మీకుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.



అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

జనన, మరణాలపై డీఎంహెచ్‌వో సమీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జనన, మరణాలు, వివాహాల నమోదు నూరుశాతం జరగాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శనివారం జనన, మరణాల నమోదుపై అధికారులతో సమీక్షించారు. రిజిస్ట్రేషన్లు నూరుశాతం జరిగేలా వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, మునిసిపల్ పరిపాలనా విభాగం, మహిళా శిశు సంక్షేమం మహిళా సాధికారత విభాగం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇతర విభాగాలు కలసి పనిచేయాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మౌనిక, ఐఎంఏ కార్యదర్శి సతీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

6

హత్య చేసి హైవే పక్కన పడేసి..

అనుమానాస్పదంగా యువతి మృతి

హోరాహోరీగా బీచ్ కబడ్డీ పోటీలు



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఓవైపు హోరున కురిసిన వర్షం.. మరోవైపు రెట్టించిన ఉత్సాహంతో కబడ్డీ ఆడేందుకు సిద్ధమైన మహిళా, పురుష క్రీడాకారులు.. బీచ్ కబడ్డీని వీక్షించేందుకు పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు తరలివచ్చారు. వర్షానికి కబడ్డీ పోటీలు జరుగుతాయో లేదోనన్న మీమాంసతో నిర్వాహకులు ఉన్నారు. సాయంత్రం వర్షం తెరిపి ఇవ్వడంతో బీచ్ కబడ్డీ పోటీలు శనివారం యథావిధిగా కొనసాగాయి.

- రెండోరోజు హోరాహోరీగా రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు
- వర్షం కురిసినా యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు
- వీక్షించిన ఎమ్మెల్సీ, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- సెమీఫైనల్స్‌కు చేరిన మహిళా, పురుషుల జట్లు

సర్పవరం జంక్షన్, మే 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఏపీ కబడ్డీ అసోసియేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో రెండోరోజు శనివారం సాయంత్రం కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో నిర్వహించిన 12వ రాష్ట్ర అంతర జిల్లాల బీచ్ కబడ్డీ పోటీలు మహిళా, పురుషుల జట్లకు వేర్వేరుగా హోరాహోరీగా సాగాయి. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా నువ్వా నేనా అన్న స్థాయిలో రసవత్తరంగా జరిగాయి. శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి క్రీడా మైదానమంతా చిత్తడిగా మారినా ఎమ్మెల్యే నానాజీ యుద్ధప్రాతిపదికన కార్పెట్లు ఏర్పాటు చేసి కబడ్డీ పోటీలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. రెండోరోజు కబడ్డీ పోటీలను డిప్యూటీ సీఎం పవన్ సోదరుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు వీక్షించారు. అనంతరం ఆయన క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని రాష్ట్ర క్రీడాస్ఫూర్తిని దేశానికి చాటిచెప్పాలని కోరారు. క్రీడలతో వ్యక్తిగత భవిష్యత్తుతో పాటు రాష్ట్రానికి ఖ్యాతి లభిస్తుందన్నారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీల్లో సత్తాచాటిన జట్లు జాతీయస్థాయికి ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందన్నారు. క్రీడల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ క్రీడలను వ్యయప్రయాసల కోర్చి చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీని అభినందించారు. నానాజీ ఆధ్వర్యంలో ఈనెల 21, 22వ తేదీల్లో ఫ్యాన్ పార్క్ ఐపీఎల్ క్రీడలు జిల్లా క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్టు సతీష్ తెలిపారు. బీచ్ సందర్శనకు వచ్చే వారికిఅన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు కు డా నుంచి రూ.3కోట్లు మంజూరు చేశామని కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి తెలిపారు. కబడ్డీ పోటీలను వీక్షించిన వారిలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, దాట్ల బుచ్చిబాబు, గిడ్ల సత్యనారాయణ ఉన్నారు. వర్షం కారణంగా సాయంత్రం 4గంటలకు ప్రారంభం కావాల్సిన కబడ్డీ పోటీలు 6 గంటలకు ప్రారంభమయ్యాయి. తిలకించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చారు.


క్రీడాకారులకు సెల్ఫీ ఇస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

విజేతల వివరాలివి..

కాగా రెండోరోజు పోటీల్లో భాగంగా పురుషుల విభాగంలో ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాల సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మహిళల విభాగంలో విజయనగరం, చిత్తూరు, కృష్ణా, అనంతపురం జిల్లాల సెమీ ఫైనల్స్‌కు చేరాయి.


బెలూన్లను వదిలి రెండోరోజు పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు



కబడ్డీ ఆడుతున్న మహిళ, పురుషుల జట్లు

రేపు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నిర్వహణ

పిఠాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక ఈ నెల 5వ తేదీన అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలోని కంతేటి పేర్రాజు పంతులు ఉన్నత పాఠశాలలో ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు చిత్తూరులో ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ జరిగే ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. 2012 జనవరి 1 తర్వాత పుట్టిన వారే ఇందులో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఎంపికలో పాల్గొనే వారు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి

పోటెత్తిన భక్తజనం

రూ.54.94 లక్షల ఆదాయం

ఆత్రేయపురం, మే 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆల యానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారి తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వా మివారిని దర్శించుకుని తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించా రు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వా మి వారికి ఒక్కరోజు రూ.54.94 లక్షల ఆదాయం లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


ఆలయంలో స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు


వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి

వెండి కిరీటం బహూకరణ

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారికి తాడేపల్లిగూడెనికి చెందిన జి.జగదీష్ దంపతులు 250గ్రాములతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని సమర్పించారు. ఆలయ ఈవో చక్రధర రావు దాతలకు స్వామి చిత్రపటం అందజేశారు.


వెండికిరీటం బహూకరిస్తున్న దాతలు

హత్య చేసి.. హైవే పక్కన పడేసి..

- భర్త హత్య కేసులో భార్య సహా ముగ్గురి అరెస్టు
- వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ


గొల్లప్రోలులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

గొల్లప్రోలు, మే 3(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన భార్య తన ప్రియుడు, స్నేహితుడితో కలిసి భర్తను హత్య చేసి మృతదేహాన్ని జిల్లా దాటించి 75 కిలోమీటర్ల దూరంలో పడవేశారు. తమ గుట్టు బయటపడలేదని భావించారు. కానీ, మృతుడి తల్లి ఫిర్యాదు, సాంకేతికత అంశాల ఆధారంగా పోలీసుల దర్యాప్తుతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి భార్యతో సహా ముగ్గురిని అరెస్టు చేసినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌లో కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను ఎస్పీ వెల్లడించారు.

మృతదేహం గుర్తింపుతో దర్యాప్తు

కాకినాడ జిల్లా పరిధిలోని కత్తిపూడి-కాకినాడ మధ్యగల 216వ జాతీయ రహదారిపై గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో మార్చి 3న గుర్తు తెలియని వ్యక్తి 35-40ఏళ్ల మృతదేహం గాయాలతో కుళ్లిన స్థితిలో ఉండగా పోలీసులు గుర్తించారు. చేబ్రోలు వీఆర్వో ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి ఎస్పీ, ఏఎస్పీ ఆధ్వర్యంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, సర్కిల్ ఎస్‌ఐలు, పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. రాష్ట్రంతోపాటు సరిహద్దు రాష్ట్రాల మిస్సింగ్ కేసులు, జాతీయ రహదారిపై సీసీ కెమేరాలు, టోల్‌ప్లాజాల వద్ద సీసీ ఫుటేజీలు, సెల్‌టవర్ ఆధారంగా విచారణ సాగించారు. దర్యాప్తు సాగుతున్న సమయంలో అనకాపల్లి జిల్లా యలమంచిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏప్రిల్ 28న తన కుమారుడు రెండునెలలుగా కనిపించడంలేదని తల్లి చేసిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదైంది. దీనిపై పరిశీలన జరపగా మృతదేహం యలమంచిలి పట్టణం ధర్మవరం ప్రాంతానికి చెందిన తంగిళ్ల లోవరాజుగా గుర్తించారు. లోవరాజు భార్య శ్యామలకు భర్త బంధువైన మాడెం మోహన్‌కుమార్‌తో వివాహేతర సంబంధం ఉంది. దీన్ని కొనసాగించడానికి భర్త అడ్డంకిగా ఉన్నాడని వారిద్దరూ భావించారు. దీంతో మోహనకుమార్, అతడి స్నేహితుడు బల్లా గంగాధరరావు కలిసి ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి లోవరాజును హత్య చేసి చేబ్రోలు హైవే పక్కన పడవేశారు. 75 కిలోమీటర్ల దూరంలో జిల్లాను దాటి మృతదేహాన్ని ఇక్కడ పడవేయడం, రెండు నెలల వ్యవధిలో తమపై ఎవరికీ అనుమానం రాలేదని నిందితులు భావించారు. కుమారుడు కనిపించకపోవడం, కోడలి ప్రవర్తనపై అనుమానంరావడంతో మృతుడి తల్లి యలమంచిలి పోలీసులను ఆశ్రయించింది. దీని ఆధారంగా దర్యాప్తు జరపడంతో కేసు కొలిక్కి వచ్చినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ వివరించారు. భార్య, ఆమె ప్రియుడు, స్నేహితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన మారుతి ఎర్టిగా కారును సీజ్ చేశారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ, ప్రత్యేక దర్యాప్తు బృందం సభ్యులను అభినందించారు.

సివిల్స్‌లో ప్రతిభకే పట్టం

- మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు
- మూడో ప్రయత్నంలో విజయం
- సన్మాన కార్యక్రమంలో 247వ ర్యాంకర్ దొమ్మేటి వినయ్



వినయ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

చాగల్లు, మే 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగే సివిల్స్ పరీక్షల్లో ప్రతిభకే పట్టం కడతారని డబ్బు, పలుకుబడికి ఎటువంటి అవకాశం ఉండదని దొమ్మేటి వినయ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం బ్రాహ్మణగూడెనికి చెందిన వినయ్ సివిల్స్ పరీక్షల్లో 247వ ర్యాంకు సాధించిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. విజయ్ మాట్లాడుతూ "అత్యంత క్లిష్టమైన సివిల్స్ పరీక్షల్లో లక్ష్యసాధన కోసం నిరుత్సాహపడకుండా నిరంతర సాధన చేయాలి. ఎప్పుడు విజయం సాధిస్తామో గ్యారంటీ లేకపోయినా పూర్తి నమ్మకంతో ఉండాలి. తిరుమలలో ఇంటర్ చేసి జేఈఈ పరీక్ష రాసి ఎలక్ట్రికల్ ఇంజనీర్‌లో చేరాను. రెండో సంవత్సరంలో సివిల్స్ పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నా. విధాన పరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం సివిల్స్ సర్వీసెస్‌లోనే ఉంది. దేశానికి, ప్రజలకు సేవ చేసే అవకాశం ఆలిండియా సర్వీసుల్లోనే ఉంది. సివిల్స్‌లో మూడు దశలు ఉంటాయి. ఏ దశలో ఆగిపోయినా మళ్లీ మొదటి నుంచి రాయాలి. మొదటి సారి ర్యాంకు సాధించి ఇంటర్వ్యూకి వెళ్లా కానీ అక్కడ సెలెక్ట్ కాలేదు. మూడోసారి రాసినప్పుడు 247వ ర్యాంకు సాధించాను. 24వ ఏటనే నాకు ఈ అవకాశం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. ఇంట్లో ఒత్తిడి లేనప్పుడే చదువులో వారికి వారే నిర్ణయాలు తీసుకుంటారు. పిల్లలు మానసిక ఒత్తిడికి గురైతే తల్లిదండ్రులు గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించాలి. ఇంటర్వ్యూలో ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతి గురించి అడిగారు. నా అభిప్రాయాలను కచ్చితంగా చెప్పాను. నా విజయం పట్ల గ్రామస్థులు సంతోషంగా ఆహ్వానించి సన్మాన కార్యక్రమం నిర్వహించినందుకు కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి బాబురావు, ఆత్కూరి దొరయ్య, టీడీపీ నాయకులు గారపాటి శ్రీనివాసరావు, పత్తిపాటి వెంకటేశ్వరరావు, గారపాటి కాశీవిశ్వనాధం, దొమ్మేటి మేణు, కరుటూరి రామారావు, గారపాటి కృష్ణ, సీహెచ్ రాధాకృష్ణ పాల్గొన్నారు. ప్రస్తుతం కొవ్వూరులో ఉంటున్న విజయ్ తండ్రి జగదీశ్వర రావు విద్యుత్ ఏఈ కాగా తల్లి కనకదుర్గ గృహిణి. కుమారుడి విజయంలో కీలకపాత్ర పోషించిన తల్లిదండ్రులను సభికులు కొనియాడారు.

అనుమానాస్పదంగా యువతి మృతి

బావే చంపేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు


ఫైల్‌ఫొటో

శంఖవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం సాయంత్రం కాకినాడ జిల్లా శంఖవరం మండలం గొంది కొత్తపల్లికి చెందిన మిమిడి లోకేశ్వరి (19) ఇంట్లో ఉరికి వేలాడుతూ కనిపించింది. తొలుత ఆత్మహత్యగా భావించిన తల్లిదండ్రులు పోలీసు ఫిర్యాదు లేకుండా దహన కార్యక్రమాలు చేసేద్దామనుకున్నారు. అయితే మృతురాలి అక్క భర్తపై అనుమానం రావడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. దివ్యాంగురాలైన తన అక్క భర్త వేరొక మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని గ్రామంలో పుకార్లు రావడంతో శుక్రవారం ఆ మహిళ ఇంటికి వెళ్లి లోకేశ్వరి తన బావ జోలికి రావొద్దని హెచ్చరించింది. ఈ విషయం తెలుసుకున్న బావ లోకేశ్వరిని మందలించాడు. దీంతో ఇద్దరికి వాగ్వాదం జరిగింది. అదేరోజు సాయంత్రం ఇంట్లో ఉరికి వేలాడుతూ కనిపించింది. తన పెద్దల్లుడే తన కూమార్తెను చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నాడని యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దివ్యాంగురాలైన తన అక్క కాపురం చెడిపోతుందనే మనస్థాపంతో యువతి ఆత్మహత్య చేసుకుందని అన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. శవపంచనామా నివేదిక ఆధారంగా దర్యాప్తు చేసి చర్యలు చేపడతామని అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు తెలిపారు.


లోకేశ్వరి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

'ఉమ్మడి జిల్లాలో ఐసీడీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), మే 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ ఆఫ్ ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అసోసియేషన్ ఈవో, సూపర్‌వైజర్స్ జిల్లా సమావేశం కాకినాడ ఫుడ్ స్ట్రీట్ శాంతిభవన్‌లో శనివారం నిర్వహించారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ పి.ప్రకాష్ కుమారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు డి.శ్రీకాంత్ రాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ ఉద్యోగుల సమస్యలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయని వాపోయారు. అంగన్‌వాడీ లెవెల్ నుంచి సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సి బ్బందికి మొబైల్ యాప్స్‌తో పని భారం చాలా విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సూపరింటెండెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జిల్లా ప్రెసిడెంట్‌గా ఎస్.పద్మశ్రీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.అరుణ, జిల్లా ట్రెజరర్‌గా కే.నిర్మల కుమారి, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కే.రమణికుమారిలు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.



నూతనంగా ఎన్నికైన మహిళా శిశు విభాగం ఉద్యోగుల కాకినాడ జిల్లా కార్యవర్గం

ఓబీఈపై అవగాహన సదస్సు

జేఎన్టీయూకే, మే 3(ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ(యూసీఈకే)కు త్వరలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) బృందం రానున్న దృష్ట్యా శనివారం సెనేట్ హాల్లో అధ్యాపకులకు ఎన్‌బీఏ గుర్తింపునకు చేపట్టాల్సిన విధానాలు, అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీఈ)పై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్.మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు వరంగల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) సీఎస్ఈ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ టి.రమేష్ రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు. రమేష్ మాట్లాడు తూ మెరుగైన ఎన్‌బీఏ ర్యాంకు సాధించేందుకు అధ్యాపకుల సమష్టి కృషి చాలా అవసరమన్నారు. నిర్దేశిత పాఠ్యప్రణాళిక, బోధన, బోధనా పద్ధతులు, మూల్యాంకనం, అభ్యసన తదితర వాటి రూపకల్పనపై అవగాహన పెంపొందించుకోవాలని అధ్యాపకులకు సూచించారు. రమేష్‌ను ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్‌ఆర్కే ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, పద్మరాజు, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్,బాలకృష్ణ, దీక్షితులు అధ్యాపకులున్నారు.


రీసోర్స్ పర్సన్ డాక్టర్ రమేష్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద్

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్ట్ పెన్షనర్స్‌కు (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668
AJD:207824

PLOT FOR SALE

311 Sq yds S/F on Highway Facing Polipaly & 334 Sq yds N/F on Highway Facing Dakamari Cell: 90100 56677
AJD:229873

4 Lines CLASSIFIED Rs.230/- Only

వాన...వే!


జగ్గంపేట జాతీయ రహదారిపై మురుగునీరు


శంఖవరం జాతీయ రహదారిపై నీటిని బోర్లతో తోడుతున్న స్థానికులు

శంఖవరం/జగ్గంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) వర్షం కురిసినప్పుడు రోడ్లపై వర్షం నీరు ఉండిపోవడం సాధారణమే విషయమే. అయితే జాతీయ రహదారిపై కూడా నీరు ఉండిపోతే. వాహనదారులకు ఎన్నో ఇబ్బందులు తప్పవు. కాకినాడ జిల్లా శంఖవరం- కత్తిపూడి హైవే అయితే మారుమూల వీధిలా మారిపోయింది.. వర్షం, వాడకం నీరు కలిసి రాచబాటను ముంచెత్తింది. మురుగుని తొలగించేందుకు హైవే అథారిటీ, పంచాయితీ సిబ్బంది ఒకరినొకరు వంతులాడుకుని పదిరోజులుగా అలాగే వదిలేశారు. స్థానికులు ఇంజన్లు పెట్టి నీటిని బయటకు తొలగిస్తున్నారు. అలాగే జగ్గంపేట నాలుగు రోడ్ల జంక్షన్లో జాతీయ రహదారి అప్రోచ్ రోడ్డులో మురుగు నీరు పోయే మర్గాలు లేక కొద్దిపాటి వర్షం వస్తే చాలు మురుగునీటితో రోడ్డు నిండిపోతుంది.

రైల్వే సిబ్బంది అపూర్వ కలయిక

సామర్లకోట, మే 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో సామర్లకోట పరిధి రైల్వే ఎంప్లాయిస్ పాతమిత్రులు (1970-1985) కుమారులు, కుమార్తెలతో కలిసి గెట్ టూ గెదర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. తమకు విద్య నేర్పిన గురువులు ఎస్.గోపాలా చార్యులు, శ్రీరామచంద్రమూర్తి, ఇండిగ సత్యనారాయణను ఆహ్వానించి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆత్మీయ విందు నిర్వహించారు. పాఠశాల తరగతి గదుల్లో జ్ఞాపకలను నెమరువేసుకున్నారు. అనంతరం జ్ఞాపికలు అందజేసుకున్నారు. కార్యక్రమానికి నాయకత్వం వహించినవారిలో సేపేని సురేష్, కాళ్ళ గోవిందరాజులు, కెవీవీ.రావు, సియాదుల ఆదినారాయణ, కర్రి శ్రీను, సత్యనారాయణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో కలిసిన రైల్వే సిబ్బంది కుటుంబ సభ్యులు

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి
www.andhrajyothy.com

ఎన్నికల హామీలను అమలు చేయాలి

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

రాజమహేంద్రవరం అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని డిమాండ్ చేశారు. శనివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర అధ్యక్షురాలు విమల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గాభవాని, అక్కినేని వనజ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు అమ్మఒడి, ఉచిత గ్యాస్ సిలెండర్, మహిళలకు ఇళ్ల స్థలాలు, ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 వంటి అనేక హామీలు ఇచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం మహిళలను మోసం చేయడమే అన్నారు. మహిళలపై అనేక దారుణాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు కఠిన చట్టాలు తీసుకురావాలని అన్నారు. విద్యుత్ బిల్లులు సామాన్యుడు భరించలేని విధంగా మోపారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు లావణ్య, యామిని, కొండావతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను అవమానించిన ప్రధాని మోదీ

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే


విలేకరులతో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతికి రెండో సారి వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హోదాతో పాటు ఇతర ప్రాజెక్టులు ఇవ్వకుండా వెళ్లిపోయి ఆంధ్రప్రదేశ్ ప్రజలను అవమానించారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ వద్ద శనివారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జేటీ రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకకు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ తడాల కొండ రాజుతో కలిసి ముఖ్యఅతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి ఆటో డ్రైవర్లకు పంచారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోదీ ఏపికి ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ గురించి, పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వకుండానే తిరిగి వెళ్లిపోయారని ధ్వజమెత్తారు. రామారావు మాట్లాడుతూ కార్మిక చట్టాల బలోపేతానికి ఐఎన్‌టీయూసీ కృషి చేసోందన్నారు. కొండరాజు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు, కార్మికులు, కర్షకుల కోసం నిరంతరం పోరాడేది ఐఎన్‌టీయూసీ అని అన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

వ్యవసాయ విస్తరణాధికారులను
హేతుబద్ధీకరణ నుంచి మినహాయించాలి

రాజమహేంద్రవరం రూరల్ మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారులను హేతుబద్ధీకరణ నుంచి మినహాయించాలని ఉమ్మడి జిల్లా విస్తరణాధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు వేణుమాధవరావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల హేతుబద్ధీకరణలో కొన్ని చోట్ల తమను కూడా గ్రామ స్థాయిలోని రైతు సేవాకేంద్రాల్లో వేయడాన్ని నిరసిస్తున్నామన్నారు. మండల వ్యవసాయ కేంద్రాల్లో తమను సహాయకులుగా నియమించాలని కోరారు. జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం వినతి పత్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపిస్తానని మాధవరావు తెలిపినట్టు వేణుమాధవరావు చెప్పారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి ఎం.నాగేశ్వరరావు, సభ్యులు పీటర్, శివ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు పూజలు



ధవళేశ్వరం, మే 3 (ఆంధ్రజ్యోతి): వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతోత్సవాలు శనివారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి.ఆలయాన్ని పూలమాలలతో అందంగా తీర్చిదిద్దారు. విఘ్నేశ్వర పూజ, అమ్మవారికి పంచామృత అభిషేకం, అనంతరం కుంకుమార్చన నిర్వహించారు.రుత్వికు నవచండీ పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బ్యారేజ్ సెంటర్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు.సాయంత్రం మహిళా సమాజం ఆధ్వర్యంలో పేరంటం నిర్వహించి ప్రసాదాలు వితరణ చేశారు. గాయిత్రిదేవి అలంకరణలో ఉన్న వాసవి మాతను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

దండకారణ్యంలో దాడులు నిలిపివేయాలి



జెండా ఆవిష్కరిస్తున్న అఖిల భారత రైతుకూలీ సంఘం సభ్యులు

గోకవరం, మే 3(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగారు పేరుతో దండకారణ్యంలో ఆదివాసులపై జరుగుతున్న నరమేధాన్ని వెంటనే నిలిపివేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే డే వారోత్సవాల్లో భాగంగా మండలంలోని శివరామపట్నంలో శనివారం జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవిలో ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్రం పారా మిలటరీ, గ్రేహౌండ్స్ బస్తర్ ఫైటర్స్‌తో సంయుక్తంగా ఆదివాసులపై దాడులు చేస్తూ ఇబ్బందులకు గురి చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, గ్రామస్థులు అప్పలరాజు, జి.బాబు, పెద్దకాపు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి విశేష ప్రాధాన్యం

• ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ • ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల అందజేత


ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి విడుదలైన ఉపకరణాలను రాజానగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్ష ద్వారా విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిస్తోందని, దీనిలో భాగంగానే ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రత్యేక టీచర్లను నియమించి వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ, వారి పనులు వారు చేసుకునేలా శిక్షణ ఇస్తోందన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాలతో పాటుగా గోకవరం మండలానికి చెందిన 32 మంది విభిన్న ప్రతిభావంతులకు 52 ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమం లో ఎంపీపీ మండారపు సీతారత్నం, జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ ఎస్.సుభాషిణి, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, ప్రత్యేక అవసరాల విద్యార్థుల ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ కనకబాబు, రాజానగరం, కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్, కుశలవదొర, సుజాత, గౌరమ్మ, చిమ్మరాజు దొర, కూటమి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి


భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మ

అనపర్తి మే 3(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఏరియా ఆసుపత్రిలో వంద పడకల ఆసుపత్రికి సంబంధించి నిర్మితమవుతున్న భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారిణి డాక్టర్ పద్మ ఆదేశించారు. శనివారం ఆమె ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రి రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై స్వయంగా వార్డులలో పర్యటించి రోగులను అడిగి తెలుసుకున్నారు. లేబ్‌ను పరిశీలించిన అక్కడి పరికరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులతో భవన నిర్మాణాల పురోగతిపై చర్చించారు. త్వరితగతిన వాటిని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్, ఎన్ఎస్ సరోజిని, ఏవో మాణిక్యాంబ, పలువురు వైద్యులు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

» ఎమ్మెల్యే గోరంట్ల » కడియంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం


ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, మే 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. శనివారం కడియంలో రూ.4.18 కోట్ల తో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. రూ.2.45 కోట్లతో నిధులతో నూతనంగా నిర్మించే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి, సుబ్బారావుపేటలో సుబ్బారావుపేటలో రూ.76.50 లక్షలతో వాటర్‌ట్యాంక్, రూ.24.20 లక్ష లతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రూ.73 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలతో మండల కేంద్రమైన కడియంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. అత్యధిక ప్రాధాన్యతగా మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలో ఏపీ పేపరుమిల్లు సహకారంతో ఏర్పాటు చేసిన పలు రకాల పరికరాలను ప్రారంభించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, అన్నందేవుల చంటి, మార్గాని సత్యనారాయణ, డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, చెల్లుబోయిన శ్రీను, ఆకుల శ్రీధర్, బోడపాటి గోపి, పంతం గణపతి తదితరులు పాల్గొన్నారు.

డి-బ్లాక్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ముద్దుబిడ్డ, మహనీయుడు నందమూరి తారక రామారావు అని ఆయనకు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఉందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. హుకుంపేట పంచాయతీ డి బ్లాక్‌లో సోమేశ్వరరావు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని టీడీపీ హెల్త్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్‌తో ఎమ్మెల్యే గోరంట్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన ఏకైక నేత ఎన్టీఆర్ అని, పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను తెచ్చి చరిత్ర సృష్టించారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, టీడీపీ మండలాధ్యక్షుడు మచ్చేటి సత్యప్రసాద్, మజ్జి పద్మావతి, నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, దుద్దుపూడి రామకృష్ణ, మండ బిందు, దుద్దుపూడి రమేష్, పెండ్యాల రామకృష్ణ పాల్గొన్నారు.

ముస్లింలకు పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి: ఆరీఫ్

రాజమహేంద్రవరం సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): రాజకీయ స్వలాభం కోసం, మతోన్మాదుల మెప్పుకోసం ముస్లింలను ఉగ్రవాదులతో పోల్చిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తక్షణమే ముస్లింలకు క్షమాపణ చెప్పాలని జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మహమ్మద్ ఆరీఫ్ డిమాండ్ చేశారు. జాంపేటలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ గడ్డపై పుట్టిన ఎందరో ముస్లింలు దేశాభివృద్ధి కోసం తమ జీవితాలను అంకితం చేశారన్నారు. జనసేనలో ఉన్న మైనార్టీ నాయకులు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యల పట్ల ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

కర్రల లోడు పడి వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం టింబర్ యార్డులో కర్రల లోడు పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. ధవళేశ్వరం గ్రామం ఎర్రకొండకు చెందిన బోనెం పెంటయ్య(50) స్థానిక ఆర్యాపురం టింబర్ యార్డులో శనివారం కర్రల లోడు దింపుతుండగా తాడు తెగి కర్రలు అతడిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎండ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి

దివాన్‌చెరువు, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో ఎండ తీవ్రత, వడదెబ్బల నుంచి రక్షణకు ప్రజలు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్ కోరారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ తమ పీహెచ్‌సీ పరిధిలో వడదెబ్బ కేసులు ఏమీ రాలేదని చెప్పారు. ముఖ్యంగా ప్రజలు ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా నీరు తాగడంతో బాటు ఓఆర్ఎస్ ద్రావణం కుడా తీసుకోవాలని సూచించారు. తమ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లలో ఓఆర్ఎస్ కార్నర్‌లు ఏర్పాటు చేసి అక్కడ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.

పలువురికి పరామర్శ

గోకవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురిని వైసీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం శనివారం పరామర్శించారు. అనారోగ్యానికి గురైన తిరుమలాయపాలెం ఉప సర్పంచ్ దాకారపు దుర్గాప్రసాద్, షేక్ హుస్సేన్, బుజ్జి రాజులను కలిసి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో దాసరి చినబాబు, గుల్లా ఏడుకొండలు, పాటి రాంబాబు, సుంకర వీరబాబు, రమణ, నాని, కిరణ్ తదితరులు ఉన్నారు.



బలభద్రపురంలో ఇళ్ల నిర్మాణాలపై మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి

బిక్కవోలు, మే 3(ఆంధ్రజ్యోతి): అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాస్ సూచించారు. బలభద్రపురంలో హౌసింగ్ డే సందర్భంగా సచివాయం-1లో సర్పంచ్ బి.రామారావు అధ్యక్షతన ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మన ఇల్లు- మన గౌరవంలో భాగంగా ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉన్న 65 మందికి అదనంగా రూ.50 వేలు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని, వెంటనే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. తమ సిబ్బంది నిరంత రం అందుబాటులో ఉంటారని వెంటనే ఇంటి పనులు చేపట్టాలని ఏఈ వనమయ్య తెలిపారు. సదస్సులో ఎంపీటీసీ వీర్రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.సంజీవరెడ్డి, గృహనిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

8న గాడాల పీఠంలో శ్రీవారి కల్యాణోత్సవం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం గాడాలలో శ్రీ మహాలక్ష్మీ సమేత చినవెంకటేశ్వరస్వామి పీఠంలో కల్యాణోత్సవాలు ఈ నెల 4నుంచి 8 వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 8న శ్రీనివాసుడి కల్యాణోత్సవం జరుగుతుందని, ఈ ఉత్సవాలు మన గుడి-మన సేవ భారతీయ సేవా సమితి, అనుగ్రహ ప్రదా ఫౌండేషన్, సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కల్యాణోత్సవాల పోస్టర్‌ను శనివారం కంబాలచెరువు దగ్గరలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు బాలాజీ, చిన వెంకన్నబాబు స్వామిజీ, వాసంశెట్టి గంగాధరరావు ఆవిష్కరించారు.

నర్సరీ రైతుల కృషి అభినందనీయం

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్


నర్సరీలో వృక్ష జాతి మొక్కలను చూస్తున్న సూపరింటెండెంట్

కడియం, మే 3(ఆంధ్రజ్యోతి): కడియం నర్సరీ రైతుల కృషి అభినందనీయమని రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అన్నారు. శనివారం బుర్రిలంక కొత్తపల్లి మూర్తి-ఉమాపార్వతి నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా మూర్తి నర్సరీలో 100 ఏళ్ల వయసున్న వృక్షజాతి మొక్కలను ఎలా తయారు చేశారు? ఎలా పెంచాలనే విషయాలను తెలిపారు. వృక్షజాతి మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ దేశానికి, పర్యావరణానికి నర్సరీ రైతుల సేవలు అభినందనీయమన్నారు. నర్సరీల ద్వారా అనేక మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్, పర్యావరణమిత్ర చిలుకూరి శ్రీను, సాదనాల బాబ్జి తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


నల్లమిల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రంగంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నల్లమిల్లి, సింగంపల్లి, మర్రిపూడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మర్రిపూడి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నల్లమిల్లి, సింగంపల్లి, మర్రిపూడిలో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు. నల్లమిల్లి, సింగంపల్లి, మర్రిపూడిలో నిర్మించనున్న సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మర్రిపూడి గ్రామ కూటమి నాయకులు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, జనసేన మండల అధ్యక్షుడు గిరజాల సత్తిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.సాయిరాం తదితరులతో పాటు ఎంపీడీవో సాయిబాబు, మండల, గ్రామ ఎన్డీయే కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ఎమ్మెల్యే నల్లమిల్లి పూజలు


ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రధాని పర్యటన విజయవంతంగా ముగిసిన సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన

సీతానగరం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇనుగంటివారిపేటలో వైద్య ఆరోగ్య సిబ్బంతో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీతానగరం పీహెచ్‌సీ ఎంపీహెచ్ ఈఓ వై.సుబ్బారాయుడు మాట్లాడారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఏవీకె చైతన్య ఆధ్వర్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకట్ విఠల్, ఏఎన్ఎం శాంతి, మహిళా పోలీస్ అమ్మాజీ, అంగన్‌వాడీ వర్కర్ దివ్య, భారతి, ఆశావర్కర్ పుష్పరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కోరుకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్‌స్టేషన్, అల్లూరి సీతారామరాజు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎమ్మెల్యే సతీమణి జనసేన జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రాజానగరం, కోరుకొండ, సీతానగరం బస్టాండ్ సమీపంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ వార్షికోత్సవం

కడియం, మే 3(ఆంధ్రజ్యోతి): కడియపులంక హరిహర మహాక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పండితులు తిరుమంజన అభిషేకం, హోమం, శాంతి కల్యాణం తదితర పూజా కార్యక్రమాలు జరిపారు.

రాజమండ్రి ప్రెస్‌క్లబ్ ప్రతిపాదిత సభ్యుల జాబితా విడుదల

రాజమహేంద్రవరం సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ సభ్యుల ప్రపోజల్ జాబితాను శనివారం రాత్రి అడహక్ కమిటీ విడుదల చేసింది. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌కు సంబంధించి పాలక మండలి ఎన్నికల షెడ్యుల్‌ను కూడా కమిటీ విడుదల చేసింది. ప్రతిపాదిత జాబితాలో 124 మంది పేర్లు ఉన్నాయి. ఈ జాబితాలో లేని వారు తమ అభ్యంతరాలను ఈ నెల 7వ తేదీలోపు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన అభ్యంతరాల స్వీకరణ బాక్స్‌లో వేయాలని కమిటీ సూచించింది. అభ్యంతరాల పరిశీలన తర్వాత ఈ నెల 11న సభ్యుల తుది జాబితా ప్రదర్శన, అదే రోజు నుంచి ఈనెల 13వ తేదీ వరకు సభ్యత్వ రుసుము పాతవి రూ.100, కొత్తవాటికి రూ.200 చెల్లించాలని సూచించారు. ఈ నెల 14 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభిస్తున్నట్టు కమిటీ తెలిపింది. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంట వరకు నామినేషన్ల స్వీకరణ, 15న ఉపసంహరణలు, 16న పోటీలో వుండే అభ్యర్థుల జాబితా ప్రకటన, 18న ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్, 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు విజేత ప్రకటన నిర్వహిస్తామని అడహక్ కమిటీ స్పష్టం చేసింది.

కోటగుమ్మంలో చలివేంద్రం

రాజమహేంద్రవరం కల్చరల్ మే3(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నాయకుడు క్షత్రియ బాలసుబ్రమణ్యం సింగ్ ఆధ్వర్యంలో స్థానిక కోటగుమ్మం సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కంటిపూడి సింగ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాలతో ప్రజల సౌకర్యార్థం ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నెక్కెళ్ల బాబూరావు, కమలేశ్, జి.లలితకుమార్, ఎనుముల రంగబాబు, కాలుమూరి సురేష్, జి.చిన్ని సోమేశ్‌రాజు, బషీర్, రత్నంబోయిన సురేంద్ర పాల్గొన్నారు.

సీసీ కెమెరాల అందజేత

కడియం, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో సీసీ కెమేరాల ఏర్పాటుకు కడియపులంక ఆంజనేయస్వామి కమిటీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామస్థుల సహకారంతో రూ.1 లక్ష విలువ చేసే సీసీ కెమేరాలను కడియం సీఐ ఎ.వెంకటేశ్వరరావుకు అందజే శారు. ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సేవా కార్యక్రమం అభినందనీయమని సీఐ అన్నారు.


దోసకాయలపల్లిలో శివాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

శివాలయం శంకుస్థాపన.. ఎమ్మెల్యే బత్తుల పూజలు

కోరుకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): దోసకాయలపల్లి గ్రామంలో శనివారం ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపనలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఎమ్మెల్యే నూతన శివాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మార్ని నాని, మార్ని బుజ్జి, సర్పంచ్ ధారా యశోదమ్మ, ధారా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏగులమ్మ జాతర

కోరుకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): నర్సాపురం గ్రామదేవత ఏగులమ్మ అమ్మవారి జాతర నాల్గోవ రోజు శనివారం వైభవంగా సాగింది. గ్రామంలో అమ్మవారి గరగలు మేళతాళాల మధ్య తిరిగాయి. కార్యక్రమంలో వేగులమ్మ అమ్మవారి యూత్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.







చిందర వందరగా పడేసిన వస్తువులు

మాజీ మంత్రి జవహర్ ఇంట్లో చోరీ

కొవ్వూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ నివాసంలో దొంగలు పడ్డారు. కొవ్వూరు పట్టణం నందమూరు రోడ్‌లో ఉన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి కె.ఎస్.జవహర్ ప్రధాని నరేంద్ర మోదీ సభకు ఇన్‌చార్జిగా నియమించడంతో గత 10 రోజుల కిందట గుడివాడ వెళ్లారు. మూడు రోజుల కిందట ఆయన భార్య, పిల్లలు స్వగ్రామం తిరువూరు వెళ్లారు. శనివారం ఇంట్లో మొక్కలకు నీళ్ల పోయడానికి జవహర్ అనుచరుడు వి.వి.రాజు ఇంటికి వచ్చాడు. ఇంటి వెనుక వైపు తలుపులు తెరచి ఉండడంతో అనుమానం వచ్చి చూశాడు. దొంగతనం జరిగిందని గమనించి పోలీసులు, జవహర్‌కు సమాచారం అందజేశాడు.డీఎస్పీ జి.దేవకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీరువాల్లో బట్టలు, సామగ్రి చిందరవందరగా పడవేసినట్టు గుర్తించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న జవహర్ భార్య ఉష, కుమారుడు కొత్తపల్లి ఆశిష్‌లాల్ హుటాహుటిన కొవ్వూరు వచ్చారు. ప్రాథమికంగా 2 సెల్ ఫోన్లు, 2 వాచీలు, 3 బంగారపు ఉంగరాలు, ఒక టీవీ, రూ.45 వేలు నగదు, వెండి వస్తువులు చోరీ చేసినట్టు సమాచారం.రాజమహేంద్రవరం నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వేలిముద్రలు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

ఆపదమొక్కుల.. వాడపల్లి!

ఏడు వారాల వెంకన్నగా ఖ్యాతి

ఉన్నావా అసలున్నావా.. ఉంటే కళ్లుమూసుకున్నావా.. భక్తతుకారాం సినిమాలో పాట ఇది.. నిన్న మొన్నటి వరకూ చాలామంది అభిప్రాయం కూడా ఇదే.. దేవుడు లేడనేది వాదన.. ఈ అభిప్రాయం తప్పని.. నేనున్నానని నిరూపించాడు.. వాడపల్లి వేంకటేశ్వరుడు. అందుకే ఆయనను నిదర్శనమూర్తిగా కొలుస్తారు. నిజానికి 2009 వరకు ఆ స్వామిని కొలిచేవారే అరుదు.. కల్యాణోత్సవాల సమయంలో తప్ప ఆ స్వామి చెంత సందడే ఉండేది కాదు.. మరి నేడు.. ప్రతి వారం లక్షలాదిగా భక్తులను తన చెంతకు రప్పించుకుని కోరిన కోర్కెలు తీర్చే ఆపదమొక్కుల వాడిగా వినుతికెక్కారు.. అమెరికా.. ఆస్ట్రేలియా.. తదితర దేశాల నుంచి భక్తులు వస్తున్నారంటే ఆ స్వామి దయ కాకపోతే మరేమిటి.. కోరిన కోర్కెలు తీరుస్తాడనే నమ్మకమే వాడపల్లికీ మహర్దశ. - ఆత్రేయపురం





దేవుడున్నాడు.. భక్తజనం కోర్కెలు తీరుస్తున్నాడు.. అందుకే ఒక్కటా రెండా ఏకంగా ప్రతి శనివారం 40 వేల నుంచి 50 వేల మంది భక్తులు ఆ స్వామిని చూసేందుకు ఎక్కడెక్కడి నుంచో వస్తున్నారు. స్వామిని దర్శించుకుని వెళుతున్నారు. ఒకనాడు ఎక్కడ ఉందో తెలియని వాడపల్లి.. వేంకటేశ్వరుడి ఊరుగా తిరుమల అంత ప్రసిద్ధికెక్కింది. గౌతమి నదీ తీరాన పచ్చని పంటపొలాల నడుమ వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తజన గోవిందనామస్మరణతో విరాజిల్లుతుంది. సుమారు 15 ఏళ్ళ కిందట ఏడాదికోమారు స్వామి ఉత్సవాలు చేయాలంటేనే కష్టం.. అటువంటి స్థితి నుంచి నేడు తిరుమల తరహాలో ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. అలనాడు వందల్లో భక్తులుంటే నేడు ఆ సంఖ్య వేలకు చేరింది. ఓ భక్తుడు సొంత విమానంలో వచ్చి స్వామిని దర్శించుకుని రూ.కోటి విరాళం అందించి వెళ్లారంటే స్వామి ఎంత మహిమాన్వితుడో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత స్వామి వార్షికాదాయం రూ.32 కోట్లకు చేరుకుంది.

ఎర్రచందనం కొయ్యతో స్వామి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో స్వయం భూ ఎర్రచందన కొయ్య విగ్రహంతో మూర్తీభవించిన స్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిస్తారు. దేవతామూర్తుల విగ్రహాలను శిలతో తయారు చేస్తే స్వామి మాత్రమే ఎర్రచందనంతో మూర్తీభవించారు.

2009 నుంచి 7 ప్రదక్షిణలు..

2009 మార్చి 23న అప్పటి ఈవో, సిబ్బంది ఏడు వారాల వెంకన్న దర్శనం...ఏడేడు జన్మల పుణ్యఫలంగా స్వామి ఖ్యాతిని ఇనుమడింప జేశారు.. అక్కడి నుంచి స్వామి వెనుతిరిగి చూసుకోలేదు. భక్తుల కోర్కెలు తీర్చే స్వామిగా అంచలంచెలుగా వినుతికెక్కారు. ఏడు శనివారాలు.. స్వామివారి ఆలయంలో ఏడు ప్రదక్షిణలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీరుస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా నిలిచింది. తిరుమల తరహాలో పవిత్రోత్సవాలు, అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవాలు, గోదాదేవి కల్యాణం కోట్లాది రూపాయలతో నిర్వహిస్తున్నారు. నిత్యం ఆలయంలో ఐశ్వర్యలక్ష్మీ హోమం, నిత్యకల్యాణం, అష్టోత్తర పూజలు చేస్తారు.

స్వామి వెలిశారిలా..

విష్ణుమూర్తి ఒకప్పుడు నౌకాపురిగా పిలిచే వాడపల్లిలో వెలుస్తానంటూ అభయమిచ్చాడట.. కొంత కాలానికి గోదావరిలో ఒక పెట్టె కొట్టుకువచ్చింది.. ఒక వృద్ధుడికి స్వామి కలలో కనిపించి ఆ చందన పెట్టె గురించి తెలియజేశాడట.. మరునాడు పెట్టె తీసి తెరిస్తే ఎర్రచందనంతో చెక్కిన స్వామి దివ్య మంగళమూర్తి కనిపించిందట. ఇది తెలిసి నారదుడు స్వామికి వేంకటేశ్వరుడు అని నామకరణం చేసి ఆలయాన్ని నిర్మించాడని పురాణ కథనం.

నాడు వడ్డికాసులవాడే..

2009కి ముందు స్వామి వార్షికాదాయం రూ.18 లక్షలు ఉండేది. ప్రతి ఏటా మార్చి నెలలో స్వామి కల్యాణం నిర్వహిస్తారు. ఆదాయం అంతంత మాత్రంగానే ఉండడంతో అప్పటి ఈవో, సిబ్బంది రూ.3 లక్షల వరకూ అప్పు తెచ్చేవారట. అనంతరం శిస్తును వసూళ్లు చేసి స్వామి కల్యాణం అప్పులు తీర్చేవారు. ప్రస్తుతం 6-ఏ నుంచి డిప్యూటీ కమిషనరు స్థాయికి ఈ క్షేత్రం చేరుకుంది. వార్షికాదాయం రూ.18 లక్షల నుంచి నేడు రూ.32 కోట్లకు చేరుకుంది. 2023లో డీసీ హోదా దక్కించుకున్న ఈ క్షేత్రం 2026లో రీజనల్ జాయింట్ కమిషనరు హోదాకు చేరుకోనుంది. ఆలయంలో 310 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏటా జీతభత్యాల కింద రూ.6.32 కోట్లు చెల్లిస్తున్నారు.

భూములు.. 116 ఎకరాలు



తిరుమల తరహాలో స్వామికి దాతలు బంగారు విరాళాలు అందజేస్తున్నారు. ప్రస్తుతం స్వామివారికి 7.421 కిలోల బంగారం ఉంది. వెండి 183.339 కిలోలు ఉంది. స్వామికి 406 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 116 ఎకరాలు మాత్రమే ఆధీనంలో ఉంది. దీని ద్వారా రూ.35 లక్షల ఆదాయం వస్తుంది. మిగిలిన భూమి అన్యాక్రాంతమైనట్టు తెలిసింది.

నిత్యాన్నదానం

నిత్యాన్న దానం ఉంది. ప్రతి నెలా 1.50 లక్షల మంది భక్తులు స్వామి ప్రసాదం స్వీకరిస్తారు.రూ.40 లక్షలు ఖర్చవుతుంది. అన్నప్రసాదానికి రూ.11.09 కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. రూ.120 కోట్లతో కేంద్రం అందించే ప్రసాద స్కీమ్‌కు ప్రతిపాదనలు చేసి నట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఆదాయం రూ.39 కోట్లు

ఏడాది	ఆదాయం	ఖర్చులు (కోట్లు)
2021-22	రూ.9.36	రూ. 8.68
2022-23	రూ.18.82	రూ.18.14
2023-24	రూ.28.88	రూ. 26.53
2024-25	రూ.39.09	రూ. 32.01

ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.3.65 కోట్లు

సేవింగ్స్ ఖాతాలో సుమారు రూ.5 కోట్లు



రోడ్డుపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

పుష్కర అంచనా రూ.2 వేల కోట్లు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం : ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి 2027 పుష్కరాలకు రూ.2 వేల కోట్లు అంచనాలు ప్రభుత్వానికి పంపించామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వనగర్‌లో రూ.90 లక్షలతో చేపడుతున్న రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. గోదావరి పుష్కరాలకు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలో ఇంటర్నల్ రోడ్డుకు సంబంధించి గత వైసీపీ హయాంలో వెంకటేశ్వరనగర్ రోడ్డుకు నిధులు మంజూరైనా.. ఈ ప్రాంతంలో వైసీపీ ఓటర్లు లేరనే తప్పుడు భావనతో కక్షపూరితంగా ఏళ్ళతరబడి రోడ్డు వేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు పరుగులు పెట్టిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ నెల 7న గోదావరి రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. అప్పర్ ప్రామినేట్ పనులు ముందుగా చేపడుతున్నామని.. లోయర్ ప్రామినేట్ పనులకు ఇరిగేషన్ అధికారుల అనుమతి రావాల్సి ఉందన్నారు. గత పదినెలల్లో రాజమహేంద్రవరంలో రూ.100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశామన్నారు. నగరంలో 21 పార్కుల సుందరీకరణకు రూ.10 కోట్లు కేటాయించామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, నగర తెలుగు మహిళ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ తదితరులు పాల్గొన్నారు.

మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్

కార్పొరేట్ కార్యాలయం: నం.302బి, జైన్ సద్గురు ఇమేజ్స్ క్యాపిటల్ పార్క్, ఇమేజ్ గార్డెన్స్ రోడ్, VIP హిల్స్, మాదాపూర్, హైదరాబాద్, తెలంగాణ - 500081

టెలిఫోన్: 040-49951666, ఇ-మెయిల్: co@maximusarc.com

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 6(2) మరియు రూల్ 8(6) నిబంధనతో చదవబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ రూల్స్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

పై నిబంధనలకు అనుగుణంగా, సెక్యూర్డ్ క్రెడిటార్ (మెసర్స్ మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్) కు తాకట్టు పెట్టబడిన/ చార్జ్ చేయబడినట్టి, మెసర్స్ మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్ అధీకృత అధికారి ద్వారా భౌతిక స్వాధీనం చేసుకోబడినట్టి దిగువ వివరించిన స్థిరాస్తిని మెసర్స్ సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్ (రుణగ్రహీత), శ్రీ ఉప్పులూరి వెంకట సత్యనారాయణ మరియు శ్రీమతి ఉప్పులూరి వీర వెంకట కాశీ నాగకుమారి (వ్యక్తిగత హామీదారులు) నుండి మెసర్స్ మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్‌కు (అసైన్‌మెంట్ అగ్రిమెంట్ తేదీ 01.09.2023 ప్రకారం పృథ్వీ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ & సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్ ద్వారా మెసర్స్ మ్యాక్సిమస్ ఏఆర్‌సి కంపెనీ లిమిటెడ్‌కు కేటాయించబడిన బకాయి) చెల్లింపు తేదీ వరకు తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు వ్యయాలతో 31.03.2025 నాటికి బకాయి మొత్తం రూ.12,68,98,744/- (రూపాయలు పన్నెండు కోట్ల అరవై ఎనిమిది లక్షల తొంభై ఎనిమిది వేల ఏడు వందల నలభై నాలుగు) రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అదే" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన 22.05.2025న విక్రయించబడునని రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా ప్రకటన ఇవ్వడమైనది.

రిజర్వ్‌ధర రూ.150 లక్షలు మరియు బయానా 15 లక్షలు.

స్థిరాస్తి సంక్షిప్త వివరణ

క్ర.సం	ఆస్తి వివరణ
1	1. మెసర్స్ సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లా, రాజానగరం మండలం, చక్రద్వారాబంధం గ్రామపంచాయితీ, వెలుగుబంద గ్రామ ఆర్.ఎస్.నం.663 వద్ద సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ఆవరణలో భూమిపై బిగించిన అన్ని ప్లాంట్ & మెషినరీ.
	రిజర్వు ధర రూ.150 లక్షలు; బయానా: రూ.15 లక్షలు
	తాకట్టు రుణ భారాలు: లేవు

ఆస్తి(లు) తనిఖీ తేదీ & సమయం: 09.05.2025న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం. మధ్యన.

వేలం విధానం: ఆన్‌లైన్ ఇ-వేలం https://sarfaesi.auctiontiger.net ద్వారా.

బిడ్ దాఖలుకు మరియు బయానా చెల్లింపుకు చివరి తేదీ మరియు సమయం: 21.05.2025న సా.5.00 గం. లేదా అలోగా

ఇ-వేలం తేదీ: 22.05.2025న ఉ.10.00 గం. నుండి ఉ.11.00 గం.మధ్యన.

బిడ్ పెరుగుదల: రూ.5,00,000/-

వేలం సవివర నియమ నిబంధనల కొరకు మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) వెబ్‌సైట్ అనగా: www.maximusarc.com/tenders లో అందించిన లింక్‌ను చూడగలరు. కాగోరు బిడ్డర్లు ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్‌రప్టసీ కోడ్ 2016 యొక్క సెక్షన్ 29ఎ క్రింద అనర్హులు కారని నిర్ధారిస్తూ "నోటరీ చేసిన అఫిడవిట్"ను దాఖలు చేయగలరు.

తేది: 29.04.2025 సం/- (ఆర్.వి.రాజు) అధీకృత అధికారి

ప్రదేశం: హైదరాబాద్ మ్యాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్, సెల్: 9848170245

ఇదేమి కాలం!



అబ్బబ్బా ఇది ఏమి వాన : కాకినాడ నగరంలో శనివారం కురుస్తున్న వాన

ఉదయం కుమ్ముడు.. సాయంత్రం దంచుడు

- వాతావరణంలో పెనుమార్పులు
- ఉదయం ఎండ.. సాయంత్రం వాన
- 4 రోజులుగా విస్తారంగా వర్షాలు
- శనివారం కాకినాడలో అత్యధికం
- సాధారణ స్థితికి వర్షపాతం
- ఆశ్చర్యపోతున్న అధికారులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఒక పక్క తీవ్రమైన ఎండ.. ఉదయం ఏడు నుంచే నడినెత్తిన సూర్యుడి ప్రతాపం.. బయటకు రావాలంటేనే ఎండవేడికి ఉక్కబోత..చెమటలతో తడిచి ముద్దవుతున్న పరిస్థితి.. మరో పక్క అంత ఎండతో ఆపసోపాలు భరిస్తోన్న ప్రజలకు సాయంత్రం అయ్యేసరికి ఒక్క సారిగా వరుడి కరుణతో ఉపశమనం.. చిరుజల్లుల నుంచి కుండపోత వానతో చల్లబడుతోన్న వాతావరణం.. ఒకపక్క ఈదురుగాలులు.. మరోపక్క కూలుతోన్న విద్యుత్ స్తంభాలు.. నేలకొరుగుతున్న చెట్లతో విచిత్ర పరిస్థితులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నెలకొన్నాయి. మండు వేసవితో



అల్లాడించే ఏప్రిల్, మే నెలల్లో గడచిన కొన్నిరోజులుగా భారీ వర్షాలు జిల్లాను ఊపేస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఉదయం తీవ్రమైన వేడి.. సాయంత్రం అయ్యేసరికి భారీ వర్షాలతో విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలో శనివారం అనేక చోట్ల 38డి గ్రీలకుపైగా ఎండ చుక్కలు చూపించగా..మధ్యాహ్నం దాటేసరికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉన్నట్టుండి కుండపోతగా వాన.. ఈదురుగాలులు..బీభత్సం సృష్టించాయి. కాకినాడ రూరల్‌లో అయితే ఏకంగా రాష్ట్రంలోనే అత్యధికంగా 4.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాకినాడ నగరంలో రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లోకి వాన నీరు వచ్చేసింది. అటు కోటనందూరులో 2.7, కిర్లంపూడి 2.1, తుని 2.25, తాళ్లరేవు,శంఖవరం,రౌతులపూడి,గొల్లప్రోలు, పిఠాపురం, పెదపూడి మండలాల్లో 1.7, తూర్పుగోదావరి జిల్లా రంగంపేట 2.75, గోపాలపురంలో 0.25 మి.మీ. వర్షపాతం నమోదైంది.అయితే ప్రధానంగా తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలతో పోల్చితే కాకినాడ జిల్లాలో గడచిన రెండువారాలుగా వర్షాలు అనేక మండలాల్లో దంచికొడుతున్నాయి. ఏకంగా భారీ ఈదురుగాలులు, కుండపోత వర్షం కురుస్తుండడం విశేషం. ఇటీవల అన్నవరంలో కురిసిన భారీ వర్షానికి ఆలయ మెట్లపై ధారలా వాననీరు ప్రవహించింది. శనివారం సైతం జిల్లాలో అనేక మండలాల్లో వానకుతోడు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ముఖ్యంగా కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో అయితే ఏకంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కొన్నిరోజులుగా గాలివానకు పడుతూనే ఉన్నాయి.

లోటు నుంచి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత నెల ఏప్రిల్‌లో కురిసిన వర్షాలు జిల్లాను లోటు నుంచి సాధారణ వర్షపాతం స్థాయికి తీసుకొచ్చాయి. వాస్తవా నికి అంతకుముందు మార్చి నెలలో ఉమ్మడి జిల్లా లోటు వర్షపాతం జాబితాలో ఉంది. కాకినాడ జిల్లాలో మార్చి నెలలో సాధారణ వర్షపాతం 12.49 సెంటి మీటర్లు కురవాల్సి ఉంటే 0.82 సెం.మీతో లోటులో ఉంది. కోనసీమ జిల్లాలో 12.02 సెం.మీ.కు సున్నా వర్షపాతం నమోదైంది. తూర్పుగోదావరి జిల్లాలో 15.18 సెం.మీకు 0.04 మి.మీ కురిసింది. ఏప్రిల్ నెలలో కాకి నాడ జిల్లాలో 16.4 సెం.మీ. వర్షం కురవాల్సి ఉంటే ఏకంగా 45.81 సెం.మీ వర్షపాతం నమోదైంది. కోన సీమ జిల్లాలో 10.52 సెం.మీ.కు 20.17 సెం.మీ. కురి సింది. తూర్పుగోదావరి జిల్లాలో 16.73 సెం.మీ.కు 47.49 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఒకరకంగా ఈనెలలో ఈ స్థాయిలో వర్షపాతం నమోదవడం అరుదని వాతావరణ శాఖాధికారులు వివరించారు.



పిఠాపురంలో వానకు తడవకుండా ధాన్యంపై కప్పిన బరకాలు



బోల్తాపడిన ట్రాక్టర్..మృతిచెందిన యజమాని

అలవాటైనా.. ఆయువు తీసింది..

పెరవలి,మే 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి ఊపిరితీసింది.. చిన్నపాటి నిర్లక్ష్యం ప్రాణాలనే బలితీసుకుంది..రొయ్యల చెరువులో ట్రాక్టర్‌తో దున్ని మట్టిని చదును చేసి గట్టున పోస్తుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ వెనక్కువచ్చి తిరగబడి యజమాని మృతిచెందినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పెరవలి మండలం కానూరుకు చెందిన జన్ని రాంబాబు (50) శనివారం ఉదయం తన సొంత రొయ్యల చెరువులో మట్టి దుక్కు దున్నడానికి వెళ్లాడు. చెరువులో మట్టిని ట్రాక్టర్‌తో పైకి గెంటే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. రాంబాబు ట్రాక్టర్ కింద ఇరుక్కుపోవడంతో చుట్టుపక్కల వారు అతన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య లక్ష్మి,కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.



అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

జనన, మరణాలపై డీఎంహెచ్‌వో సమీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జనన, మరణాలు, వివాహాల నమోదు నూరుశాతం జరగాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శనివారం జనన, మరణాల నమోదుపై అధికారులతో సమీక్షించారు. రిజిస్ట్రేషన్లు నూరుశాతం జరిగేలా వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, మునిసిపల్ పరిపాలనా విభాగం, మహిళా శిశు సంక్షేమం మహిళా సాధికారత విభాగం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇతర విభాగాలు కలసి పనిచేయాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మౌనిక, ఐఎంఏ కార్యదర్శి సతీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

4

నిరంతర సాధనతోనే సివిల్స్ సాధ్యం

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నిరసన

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

హార్దిక శుభాకాంక్షలు

UPSC-2025 ఫలితాలలో 274వ ర్యాంకు సాధించిన మన దామ్మేటి వినయ్ గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు. వీరికి 4-5-2025 ఆదివారం సాయంత్రం 5 గంటలకు కాకతీయ ఛారిటబుల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సితార హోటల్, J.N.రోడ్డు, రాజమండ్రి నందు అభినందన సభ ఏర్పాటు చేయడం అయినది. కావున ప్రతి ఒక్కరూ హాజరై ఈ కార్యక్రమంలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.



KCA

కాకతీయ ఛారిటబుల్ అసోసియేషన్

రాజమహేంద్రవరం

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com



బ్రాహ్మణగూడెంలో దొమ్మేటి వినయ్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

నిరంతర సాధతోనే సివిల్స్ సాధ్యం

- నిరుత్సాహ పడకూడదు
- మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లా...
- మూడో ప్రయత్నంలో విజయం సాధించా..
- సన్మాన కార్యక్రమంలో 274వ ర్యాంకర్ దొమ్మేటి వినయ్

చాగల్లు, మే 3(ఆంధ్రజ్యోతి): 'అత్యంత క్లిష్ట మైన సివిల్స్ పరీక్షల్లో లక్ష్యసాధన కోసం నిరంతర సాధన చేయాలని, ఎప్పుడు విజయం సాధిస్తామో గ్యారంటీ లేకపోయినా నిరుత్సాహపడకుండా సాధన చేయాలని దొమ్మేటి వినయ్ అన్నారు. చాగల్లు మండలం బ్రాహ్మణగూడేనికి చెందిన వినయ్ సివిల్స్ పరీక్షల్లో 274వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా అతడిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ 'జాతీయ స్థాయిలో జరిగే సివిల్స్ పరీక్షల్లో ప్రతిభకే పట్టం కడతారని డబ్బు, పలుకుబడికి అవకాశం ఉండదు. నేను తిరుమలలో ఇంటర్మీడియట్ చేసి జేఈఈ రాసి ఎలక్ట్రికల్ ఇంజనీర్‌లో చేరాను. రెండో సంవత్సరంలో సివిల్స్ పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నాను. సివిల్స్‌లో 3 దశలుంటాయి. ఏ దశలో ఆగిపోయినా మరళా మొదటి నుంచి రాయాలి. నేను మొదటి సారి ర్యాంకు సాధించి ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. మూడో సారి రాసినప్పుడు 274వ ర్యాంకు సాధించాను. ఇంట్లో ఒత్తిడి లేనప్పుడే చదువులో వారికి వారే నిర్ణయాలు తీసుకుంటారు. పిల్లలు మానసిక ఒత్తిడికి గురైతే తల్లిదండ్రులు గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించాలి. ఇంట ర్వ్యూలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి గురించి అడిగారు. నా అభిప్రాయాలను ఖచ్చి తంగా చెప్పాను. మన కష్టమంతా ఇంటర్వ్యూ చేసే వారు 30 నిమిషాల ఇంటర్వ్యూలో నిర్ణయిస్తారు. ఇంటర్వ్యూ అనేది రోప్ మీద నడక వంటిది. చాలా బ్యాలెన్స్‌గా ఎదుర్కోవాలి' అని అన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి బాబురావు, ఆత్కూరి దొరయ్య, టీడీపీ నాయకులు గారపాటి శ్రీనివా సరావు, పత్తిపాటి వెంకటేశ్వరరావు, గారపాటి కాశివిశ్వనాథం, దొమ్మేటి మేణు, కరుటూరి రామారావు, గారపాటి కృష్ణ, సీహెచ్ రాధాకృష్ణ పాల్గొన్నారు. ప్రస్తుతం కొవ్వూరులో ఉంటున్న విజయ్ తండ్రి జగదీశ్వరరావు విద్యుత్ ఏఈ కాగా తల్లి కనకదుర్గ గృహిణి. కుమారుడి విజయంలో కీలకపాత్ర పోషించిన వారిద్దరినీ సభికులు కొనియాడారు.

ఉచిత సీట్లు పేద విద్యార్థులకే అందాలి

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమీక్షలో ఎంపీపీ దుర్గారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): రాబోయే విద్యాసంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతికి కేటాయించిన 25శాతం ఉచిత సీట్లు పేద విద్యార్థులకు అందేలా అధికారులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం చూడాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని 17 ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో ఎంఈవో ఎం. తిరుమలదాసు ఆధ్వర్యంలో ఎంపీపీ దుర్గారావు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పేదలకు కేటాయించిన 500 సీట్లలో 92మంది మాత్రమే విద్యార్థులు చేరడమేమిటని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. 1వ తరగతిలో చేరిన ప్రతి విద్యార్థి 10వ తరగతి వరకు ఉచితంగా చదవచ్చునని, అర్హులైన వారందరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. పాఠశాల ప్రారంభం నాటికి బస్సుల రిపేరు, తరగతి గదులు, క్రీడాప్రాంగణాలు అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాల్స్, యజమానులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయికృష్ణ


కార్మిక చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి సాయికృష్ణ

కొవ్వూరు, మే 3(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ అన్నారు. మే డే వారోత్సవాల్లో భాగంగా పంగిడి గ్రామ సచివాలయంలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి సాయికృష్ణ మాట్లాడుతూ కార్మికులకు ఎన్నో హక్కులు, చట్టాలు ఉన్నాయని, వాటిపై ప్రతిఒక్కరూ అవగాహనా కలిగి ఉండాలన్నారు. కార్మి సంక్షేమ బోర్డు ద్వారా అందించే పథకాలను వివరించారు. కార్మికుల పిల్లలకు విద్యార్థి ఉపకార వేతన పథకం, ప్రమాద మరణాలకు ఆర్థిక సహాయం వంటి విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోశాల నాగార్జున, న్యాయవాది పి.హరీష్, సెక్రటరీ జి.ముత్యం, ఏఎస్ఐ ఇ.ధర్మరాజు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పల్లెలకు మహర్దశ


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు నాగరాజు

గోపాలపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో పల్లెలకు మహర్దశ వచ్చిందని టీడీపీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు వేముల నాగరాజు అన్నారు. కరిచర్లగూడెంలో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు శనివారం నిర్వహించారు. అధ్యక్షకార్యదర్శులుగా మగ్బుల్ బాష, అనిశెట్టి సత్తిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కరిచర్లగూడెం-సంజీవపురం బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు, గ్రామంలో శివాలయం వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.30 లక్షలు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయించడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో పటాన్ రహీం, వడ్ల మూడి సూర్యనారాయణ, అనిశెట్టి త్రిమూర్తు లు, వేముల మంగరాజు, వడ్లమూడి కిషోర్, చెన్నంశెటి బాబురావు, చెన్నంశెట్టి సీతారాములు, అందుగుల వెంకటేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విస్తరణాధికారులను

హేతుబద్ధీకరణ నుంచి మినహాయించాలి

రాజమహేంద్రవరం రూరల్ మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారులను హేతుబద్ధీకరణ నుంచి మినహాయించాలని ఉమ్మడి జిల్లా విస్తరణాధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు వేణుమాధవరావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల హేతుబద్ధీకరణలో కొన్ని చోట్ల తమను కూడా గ్రామ స్థాయిలోని రైతు సేవాకేంద్రాల్లో వేయడాన్ని నిరసిస్తున్నామన్నారు. మండల వ్యవసాయ కేంద్రాల్లో తమను సహాయకులుగా నియమించాలని కోరారు. జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం వినతి పత్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపిస్తానని మాధవరావు తెలిపినట్లు వేణుమాధవరావు చెప్పారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి ఎం.నాగేశ్వరరావు, సభ్యులు పీటర్, శివ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ రైతుల కృషి అభినందనీయం

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్

కడియం, మే 3(ఆంధ్రజ్యోతి): కడియం నర్సరీ రైతుల కృషి అభినందనీయమని రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అన్నారు. శనివారం బుర్రిలంక కొత్తపల్లి మూర్తి-ఉమాపార్వతి నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా మూర్తి నర్సరీలో 100 ఏళ్ల వయసున్న వృక్షజాతి మొ క్కలను ఎలా తయారు చేశారు? ఎలా పెంచాలనే విషయాలను తెలిపారు. వృక్షజాతి మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ దేశానికి, పర్యావరణానికి నర్సరీ రైతుల సేవలు అభినందనీయమన్నారు. నర్సరీల ద్వా రా అనేక మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్, పర్యావరణమిత్ర చిలుకూరి శ్రీను, సాదనాల బాబ్జి తదితరులు ఉన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ అందజేత
- 70 మందికి రూ.64 లక్షల విలువైన చెక్కులు పంపిణీ


కొవ్వూరులో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదల విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గంలో 70 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.64,01,967 సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. శనివారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు మండలంలో 23 మందికి రూ.25,13,119లు, పట్టణంలో 10 మందికి రూ.9,95,478, తాళ్లపూడి మండలంలో 11 మందికి రూ.4,10,547, చాగల్లు మండలంలో 26 మందికి రూ.24,82,823 సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామన పరమేశ్వరరావు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో అందజేత..

చాగల్లు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు చేతుల మీదిగా లబ్ధిదారులకు అందజేశారు. చాగల్లులో జరిగిన కార్యక్రమంలో మండలంలోని చాగల్లులో మూడు కుటుంబాలు, బ్రాహ్మణగూడెం రెండు, నెలటూరు, నందిగంపాడు గ్రామాలకు చెందిన ఒక్కొక్కరికి కలిపి రూ.13 లక్షల విలువైన చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొంగ రామకృష్ణ, పీవీ సుబ్బారావు, గారపాటి మారుతి పాల్గొన్నారు. కాగా దారవరం గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకటేశ్వరరావుకు ఆరోగ్య సమస్యల రీత్యా మంజూరైన రూ.1.34 లక్షల చెక్కును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు.


చాగల్లులో అందజేస్తున్న ఆళ్ల హరిబాబు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నిరసన

పసలపూడిలో కొనుగోలు కేంద్రానికి తాళం


రైతు సేవా కేంద్రానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఉండ్రాజవరం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో శనివారం రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రానికి తాళం వేసి ధర్నా చేశారు. పండించిన పంటను కొనుగోలు చేయాలని నినాదాలు చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో టార్గెట్‌లు పెట్టడంతో టార్గెట్‌కు మించి ఉన్న ధాన్యం ఎలా బయట మార్కెట్లో నష్టానికి అమ్ముకోవాలా అని అధికారులను ప్రశ్నించారు. దీంతో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో వీఎస్ రామారావు, వ్యవసాయాధికారి విశ్వాసరావు నిరసన స్థలానికి వెళ్లారు. రైతులు, జిల్లా అధికారులతో మాట్లాడారు. అధికారులు లక్ష్యాలు నిర్ణయించారని, వాటి మేరకు కొనుగోలు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు. రైతుల నుంచి కొంతమేర ధాన్యం కొనుగోలు చేయమని జిల్లా అధికారులు ఆదేశించడంతో రైతులు నిరసన విరమించారు.

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, మే 3(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కొవ్వూరు, పెరవలి, గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న 20 హెల్పర్ పోస్టులకు ఆర్డీవో రాణిసుస్మిత, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయకుమారి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సంధ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. కొవ్వూరు ప్రాజెక్టు పరిధిలో 4 పోస్టులకు 21 మంది, పెరవలిలో 7 పోస్టులకు 9 మంది, గోపాలపురంలో 9 పోస్టులకు 24 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూల అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.కార్యక్రమంలో సీడీపీవోలు డి.మమ్మీ, సీహెచ్.శ్రీలక్ష్మి, కె.నాగలక్ష్మి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లపూడి, మే 3(ఆంధ్రజ్యోతి): నరాల వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ఉపాధ్యాయులు ఆర్థికసాయం అందజేశారు. తాళ్లపూడి మండల పరిషత్ ప్రాథమిక ప్రత్యేక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న పొట్నూరి విజయలక్ష్మి నరాల వ్యాధితో బాధపడుతోంది. అప్పుడప్పుడు ఫిట్స్ రావడం, మరొకరి సాయం ఉంటేనే గాని నడవలేని స్థితిలో ఉందని పాప తల్లిదండ్రులు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన జిల్లాలోని ఉపాధ్యాయుల నుంచి రూ.43 వేలు వసూలు చేసి శనివారం విజయలక్ష్మి వైద్యం నిమిత్తం తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.రాజశేఖర్, జానీ మాస్టర్, ఉపాధ్యాయులు రాము, నాని, కస్సే గణేష్, కందుల శ్రీను, గ్రామస్థుడు యాళ్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

రాజమహేంద్రవరం అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని డిమాండ్ చేశారు. శనివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర అధ్యక్షురాలు విమల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గాభవాని, అక్కినేని వనజ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు అమ్మఒడి, ఉచిత గ్యాస్ సిలెండర్, మహిళలకు ఇళ్ల స్థలాలు, ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 వంటి అనేక హామీలు ఇచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం మహిళలను మోసం చేయడమే అన్నారు. మహిళలపై అనేక దారుణాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు కఠిన చట్టాలు తీసుకురావాలని అన్నారు. విద్యుత్ బిల్లులు సామాన్యుడు భరించలేని విధంగా మోపారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు లావణ్య, యామిని, కొండావతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను అవమానించిన ప్రధాని మోదీ

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే


విలేకరులతో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతికి రెండో సారి వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హోదాతో పాటు ఇతర ప్రాజెక్టులు ఇవ్వకుండా వెళ్లిపోయి ఆంధ్రప్రదేశ్ ప్రజలను అవమానించారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ వద్ద శనివారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జేటీ రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకకు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ తడాల కొండరాజుతో కలిసి ముఖ్యఅతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి ఆటో డ్రైవర్లకు పంచారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోదీ ఏపికి ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ గురించి, పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వకుండానే తిరిగి వెళ్లిపోయారని ధ్వజమెత్తారు. రామారావు మాట్లాడుతూ కార్మిక చట్టాల బలోపేతానికి ఐఎన్‌టీయూసీ కృషి చేసోందన్నారు. కొండరాజు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు, కార్మికులు, కర్షకుల కోసం నిరంతరం పోరాడేది ఐఎన్‌టీయూసీ అని అన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

సీసీ కెమేరాల అందజేత

కడియం, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో సీసీ కెమేరాల ఏర్పాటుకు కడియపులంక ఆంజనేయస్వామి కమిటీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామస్థుల సహకారంతో రూ.1 లక్ష విలువ చేసే సీసీ కెమేరాలను కడియం సీఐ ఎ.వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఆలయ కమిటీని సీఐ అభినందించారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



కొవ్వూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తు తెలియని ఆడ మృతదేహాన్ని గుర్తించినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరులోని శ్రీకృష్ణ చైతన్య స్నానఘట్టం (లాంచీలరేవు)లో ఆడ మృతదేహం తేలుతుందని స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని నది నుంచి మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభు త్వాసుపత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు 94407 96622, 91548 75583 నెంబర్లకు గాని, పోలీస్‌స్టేషన్‌లో గాని తెలియజేయాలన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మజ్జిగ పంపిణీ

కొవ్వూరు, మే 3(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శనివారం రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన క్రయ, విక్రయదారులకు దాత చౌటిపల్లి వీరరాఘవలు ఆర్థిక సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతను సబ్ రిజిస్ట్రార్ కె.సుందరరావు అభినందించారు. కార్యక్రమంలో ఎం.మణి, వి.గ్రేసమ్మ, దివ్యవాణి, రత్నకుమారి, కె.రాజు, భాస్కర్, విష్ణు, కృష్ణ, ప్రసన్న, దస్తావేజు లేఖర్లు సాదా రామకృష్ణ, కిషోర్, ఉక్కుజూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవరపల్లిలో అన్నసమారాధన

దేవరపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో ఆది శంకరాచార్యులు ధ్యాన మందిరం వద్ద ఆది శంకరాచార్యులు జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆయల కమిటీ సభ్యులు చలంచర్ల హరినాథ్, తోట సత్యనారాయణ, తిరువూరి సత్యనారాయణతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సకాలంలో మెరుగైన వైద్యసేవలందించాలి

నిడదవోలు మండల ప్రత్యేకాధికారి దుర్గేష్


తాడిమళ్ల పీహెచ్‌సీలో వైద్య సేవలపై విచారిస్తున్న ప్రత్యేకాధికారి దుర్గేష్

నిడదవోలు, మే 3(ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు, సిబ్బంది గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని మండల ప్రత్యేక అధికారి ఎ.దుర్గేష్ అన్నారు. శనివారం నిడదవోలు మండలం తాడిమళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారులు, సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండడం లేదని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన ఆకస్మికంగా పరిశీ లించారు. దీనిపై వైద్య అధికారులు, సిబ్బంది, రోగులతో ఆయన మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని దుర్గేష్ చెప్పారు.

పోతవరంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పోతవరం జడ్పీ హైస్కూల్ 2000-21 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

నల్లజర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరం జడ్పీ హైస్కూల్‌లో 2000-21 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పోతవరం ఎస్ఎస్ కళ్యాణ మండపంలో శనివారం జరిగింది.పాతికేళ్ల తర్వాత కలిసిన మిత్రులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి అల్లరి చేష్టలను గుర్తుచేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నిమ్మలపూడి వీరరాఘవులు, ఎస్.రాజేంద్రప్రసాద్, భారతి, సుబ్రహ్మణ్యం, శ్రీను, సుభాకర్, పక్రుద్దీన్‌లను ఘనంగా సత్కరించారు. రోజంతా ఆనందంగా గడిపారు. తమ సమ్మేళనానికి కృషి చేసిన కిలారి నరేష్, ప్రత్తిపాటి దానేశ్వరావు, రాయుడు రాంబాబులను ఈ సందర్భంగా అభినందించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


పుస్తక పఠనంపై అవగాహన కలిగిస్తున్న రచయిత జనార్దనరావు

నిడదవోలు, మే 3(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రచయిత వేదుల జనార్దనరావు అన్నారు. శనివారం నిడదవోలులోని శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చి ఒక గంట సమయం పుస్తక పఠనంపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులంతా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరిన్ గద్దే శ్రీను పాల్గొన్నారు.

8న గాడాల పీఠంలో శ్రీవారి కల్యాణోత్సవం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం గాడాలలో శ్రీ మహలక్ష్మీ సమేత చినవెంకటేశ్వరస్వామి పీఠంలో కల్యాణోత్సవాలు ఈ నెల 4నుంచి 8 వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 8న శ్రీనివాసుడి కల్యాణోత్సవం జరుగుతుందని, ఈ ఉత్సవాలు మన గుడి-మన సేవ భారతీయ సేవా సమితి, అనుగ్రహ ప్రదా ఫౌండేషన్, సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కల్యాణోత్సవాల పోస్టర్‌ను శనివారం కంబాలచెరువు దగ్గరలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు బాలాజీ, చిన వెంకన్నబాబు స్వామీజీ, వాసంశెట్టి గంగాధరరావు ఆవిష్కరించారు.

ముస్లింలకు పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలి: ఆరీఫ్

రాజమహేంద్రవరం సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): రాజకీయ స్వలాభం కోసం, మతోన్మాదుల మెప్పుకోసం ముస్లింలను ఉగ్రవాదులతో పోల్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తక్షణమే ముస్లింలకు క్షమాపణ చెప్పాలని జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మహమ్మద్ ఆరీఫ్ డిమాండ్ చేశారు. జాంపేటలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ గడ్డపై పుట్టిన ఎందరో ముస్లింలు దేశాభివృద్ధి కోసం తమ జీవితాలను అంకితం చేశారన్నారు. జనసేనలో ఉన్న మైనార్టీ నాయకులు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యల పట్ల ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆరీఫ్ అన్నారు.